**పుట : 12, జి. రామలక్ష్మి, హైదరాబాదు**

## నిజాయితీ

కోణపురాన్ని, వీరశేనుడు అనే రాజు పారిపాలించేవాడు. ఆ రాజు ప్రజారంజకుడు. ప్రజలను తన కన్న బిడ్డలవలే చూసుకునే వాడు. దానధర్మాలు చేయడంలో కూడా ఆ రాజుకు మంచి పేరు ఉంది.!

వీరశేనుడు, తన రాజ గృహానికి గృహద్వారం ముందు ఒక చిత్రమయిన, అందమైన బంగారపు గంటను వ్రేలాడదీశాడు. రాజమందిరం లోనికి, అతిథులెవరైనా వచ్చిన యెడల, ఆ గంట దానంతటదే మ్రోగుతుంది. ఆ గంట మ్రోగిన వెంటనే రాజభటులు వచ్చి ఆ వచ్చిన వారిని రాజుగారి దగ్గరకు తీసుకువెళ్ళేవారు. ఇలా వుండగా ఒక రోజు రాత్రి, ఒక దొంగ, కోశాగారంలో ధనం దోచుకోవటానికిగాను రాజగృహము వరకూ వచ్చాడు. ఆ దొంగ, రాజగృహ ద్వారం వరకూ వచ్చేసరికి, యధాప్రకారం ఆ బంగారు గంట ఠంగుమని మ్రోగింది. నిద్రలో వున్న రాజుగారికి ఆ గంట వినపడగానే, గబుక్కున మెలకువ వచ్చింది. వెంటనే, బయటకు వచ్చి చూసేసరికి అక్కడ ఎవ్వరూ కనపడలేదు. ‘‘ఎవరూ రాకుండానే గంట ఎందుకు మ్రోగిందా?’’ అని అనుకున్నాడు రాజు.

ఆ తరువాత, వరుసగా మూడు రోజులపాటు అదే విధంగా జరిగింది!

ఇంక వుండబట్టలేక, రాజు తన మంత్రితో, నాలుగు రోజులుగా జరుగుతున్న ఆ సంగతిని చెప్పాడు.

అంతా విని మంత్రి ఒక ఉపాయం ఆలోచించి, వెంటనే ‘‘కారణం లేకుండా బంగారు గంట నాలుగు రోజుల వరుసగా రాత్రిపూట మ్రోగుతోంది. అది అలా మ్రోగటానికి గల కారణమేమిటో చెప్పిన రాజుగారు వారికి కోరినంత ధనం ఇస్తారట!’’ అని, చాటింపు వేయించాడు.

ఈ చాటింపు విన్న దొంగ, వెంటనే సరాసరి రాజు వద్దకు వచ్చి, ‘‘మహారాజా! పిల్లలతో, దారిద్ర్యంతో, అల్లల్లాడి పోతున్న నేను, తమ కోశాగారంలో ధనం, బంగారం లాంటి ధనం, దోచుకోవటానికిగాను, నాలుగు రోజులనుంచీ వరుసగా వస్తున్నాను. కానీ, నేను వచ్చేసరికి ఆ గంట మ్రోగటం జరుగుతోంది. ఆ గంట విని భయపడి, పారిపోతున్నాను. క్షమించండి ప్రభూ!’’ అని నిర్భయంగా చెప్పాడు.

వీరశేషుడు, ఆ దొంగ ‘నిజాయితీ’కి మెచ్చుకొని, అతనికి కావలసినంత ధనం యిచ్చి పంపేశాడు.